క్లుప్తంగా

రిలే నిరాహా ర దీక్షలు



పాలకొండ: ఆర్టీసీ డిపో ఎదుల ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. యూనియన్ నాయకులు ఎన్టీ రామారావు, ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అన్ని రకాల సిక్ లీవులపై పూర్తి స్థాయి జీతం చెల్లించాలని, పాత విధానంలో వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. పీఎల్ రావు, కె.సుజాత, ఎంవీ నాయుడు, ఎం.వైకుంఠం, బీఎల్ నారాయణ, కేసీ ప్రసాద్ పాల్గొన్నారు.

2 నుంచి దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: గిరిజన గ్రామాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి దోమల నివారణా మందు ఏసీఎం 5 శాతం ఆల్ఫా సైపర్ మెత్రిన్ ద్రావణాన్ని పిచికారీ చేయనున్నట్టు మలేరియా నివారణా సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో 18 సబ్‌సెంటర్లు, 30 సచివాలయాలు, 159 గ్రామాల్లో జూన్ 14వ తేదీ వరకు స్ప్రేయింగ్ చేయనున్నట్టు తెలిపారు.

నేడు పైడితల్లి అమ్మవారి నిజరూప దర్శనం



శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారు

వీరఘట్టం: అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా వీరఘట్టం గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారు బుధవారం భక్తలకు నిజరూపంలో దర్శనమిస్తారని యజ్ఞకర్త ఎస్.వి.ఎ ల్.ఎన్ శర్మయాజీ మంగళవారం తెలిపారు. 2002లో అక్షయ తృతీయ నాడు అమ్మవారిని ఈ ఆలయంలో ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. ఉదయం 9 గంటల వరకు నిజరూప దర్శనం ఉంటుందని, తదుపరి సాధారణ దర్శనం రాత్రి 9 గంటల వరకు ఉంటుందని శర్మయాజీ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కుంకుమ ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

ఆకట్టుకున్న వర్ణచిత్రం



శ్రీలక్ష్మీ సహిత వరహన్నసింహస్వామి వర్ణచిత్రం

గరుగుబిల్లి: చందనోత్సవం సందర్భంగా వేసిన శ్రీలక్ష్మీ సహిత వరహన్నసింహ స్వామి వర్ణచిత్రం ఆకట్టుకుంది. మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన ఈ వర్ణచిత్రం ఈ ప్రాంతీయులును ఎంతగానో ఆకట్టుకొంది. ప్రత్యేక పర్వదినాలలో వర్ణ, నఖ చిత్రాలను వేయడం ఈయనకు పరిపాటి.

ముత్యాలమ్మతల్లికి నీరాజనం

భామిని: మండలంలోని బత్తిలి గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి మంగళవారం పెద్దవీధి భక్తులు చల్లదనం చేశారు. గ్రామ శివారులోని గ్రామదేవతకు మేళతాళాలతో ముర్రాటలు ఊరేగింపుగా తీసుకువెళ్లి నీరాజనాలు సమర్పించారు. బీబీసీ కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవత సంబరాలను నిర్వహించారు.

కోటదుర్గమ్మకు సంబర నీరాజనం

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఇటీవల వివాహాలు చేసుకొన్న నూతన వధూవరులు మొక్కులు తీర్చుకొనే క్రమంలో దేవస్థానానికి తరలి వచ్చారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన శక్తి వేషాలు, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. దేవస్థానం ప్రధానార్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

రహదారి కోసం వినతి

సీతంపేట: నడిమిబుడగరాయి నుంచి ఎగువ బుడగరాయికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఎస్.సొట్టయ్య, మాధవ్ తదితరులు ఎమ్మెల్యే ఎస్.జయకృష్ణకు విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు మంగళవారం వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట: మండలంలోని మండ గ్రామంలో సారా బట్టీలపై ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించగా 1300ల లీటర్ల పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్టు పాలకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సూర్యకుమారి తెలిపారు. మరో 20 లీటర్ల సారా పట్టుకున్నామన్నారు.

సారాతో ముగ్గురి అరెస్టు

పాలకొండ: సారా తయారీ, అమ్మకం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఇందుకు సంబంధించి మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన దాడుల్లో సారా తయారు చేస్తున్న పాత నేరస్తులు సవర నారాయణ, సవర భీముడు, సవర శంకరరావులను అరెస్టు చేశామన్నారు. అలాగే బెల్లం వ్యాపారి జామి సురేష్‌ను కూడా అరెస్టు చేసి కోర్టుకు తరలించామని వివరించారు.

● జ్ఞాపకాల ఒడిలో..



వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1985 – 86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 39 ఏళ్ల తరువాత మంగళవారం వీరఘట్టంలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదగా గడిపారు. కొందరు స్నేహితులను గుర్తు పట్టలేనంతగా మారిపోయారు. ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆ నాటి ఉపాధ్యాయులు గుడివాడ రాములు, మాచర్ల శ్రీరాములుదొర, పి.సుందరరావు, భోగి సత్యానందం, సీర పాణి, పొట్నూరు భరతుడు, వాన సత్యంనాయుడు, పైల వెంటలక్ష్మి, నందికేశ్వరరావులను సత్కరించారు. అంతకు ముందు వేదపండితుల ఆశీర్వచనాలు, మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఉపాధ్యాయులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేసేందుకు ఒక ట్రస్టును ఏర్పాటు చేశారు. – వీరఘట్టం

వెండి కిరీటం వితరణ



గుమ్మలక్ష్మీపురం గ్రామంలో వెలసిన వేపారమ్మ తల్లికి గ్రామానికి చెందిన బోటు గౌరీశంకరరావు, పద్మ దంపతులు మంగళవారం అర కిలో వెండితో తయారీ చేయించిన కిరీటాన్ని వితరణ చేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో వేపారమ్మ తల్లికి అలంకరించారు. –గుమ్మలక్ష్మీపురం

● వేపారమ్మకు చల్లదనం పూజలు



గుమ్మలక్ష్మీపురం గ్రామంలో వెలసిన వేపారమ్మ తల్లికి గ్రామస్తులు మంగళవారం చల్లదనం పూజలు నిర్వహించారు. మే నెల 12 నుంచి గుమ్మలక్ష్మీపురంలో వేపారమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో సర్పంచ్ బి.గౌరీశంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో మహిళలు కలసాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలంతా పెద్ద సంఖ్యలో కలసాలతో పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం

నీటి తీరువా మొండి బకాయిలు

రూ.4కోట్ల పైబడే...



చినకుదమ వద్ద పిచ్చి మొక్కలతో పిల్ల కాలువ

- జిల్లాలో ఎక్కువ బకాయిలు జియ్యమ్మవలస మండలంలోనే...
- వసూళ్లలో వెనుకబాటు

జియ్యమ్మవలస రూరల్: నీటి తరువా బకాయిలు మండలంలో దశాబ్దాలుగా పేరుకుపోతున్నాయి. జిల్లాలో నీటి తీరువా మొండి బకాయిలు జియ్యమ్మవలస మండలంలోనే అధికంగా ఉన్నట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి మీడియం ఇరిగేషన్ ద్వారా వ్యవసాయం చేస్తోన్న ఒక్కో రైతు ఎకరానికి రూ.200 లు చొప్పున, అలాగే మైనర్ ఇరిగేషన్ ద్వారా ఎకరానికి రూ.100 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కొన్నేళ్లుగా



సింగనాపురం వద్ద వట్టిగెడ్డ కాలువ దుస్థితి

ఒక్క రూపాయి కూడా వసూలు కాకపోవడంతో ఏటా నీటి తీరువా బకాయిలు పేరుకుపోతున్నాయని రెవెన్యూ అధికారులు సెలవిస్తున్నారు.

నీటి సంఘాల ఎన్నికలు వస్తున్న సందర్భంలో ఆ ఎన్నికల్లో పాల్గొన్న వ్యక్తులు తప్ప మిగిలిన రైతులు ఏ ఒక్కరు కూడా నీటి తీరువా కట్టిన పరిస్థితి లేదని తెలుస్తుంది. మండలంలోని మైనర్ ఇరిగేషన్‌గా గుమ్మడి గెడ్డ నుంచి సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది, అలాగే మీడియం ఇరిగేషన్ అయినా వట్టిగెడ్డ ప్రాజెక్టు ద్వారా సుమారు 17 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే గుమ్మడి గడ్డకు సంబంధించి జోగిరాజుపేట, కన్నపుదొరవలస, సుభద్రమ్మ వలస, వట్టిగెడ్డకు సంబంధించి సింగనాపురం, చింతల బెలగాం, పరజపాడు, కుదమ కుందరతిరువాడ తదితర గ్రామాలకు దశాబ్దాల నుంచి చుక్క సాగునీరు అందకపోవడం రైతులు ఇబ్బందులకు గురవుతూ వారంతా నీటి తీరువాను కట్టేందుకు సుముఖత చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి నీటి తీరువా విషయంలో రైతులకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో నీటి తీరువా కట్టకపోవడంతో అటు ఇరిగేషన్ పనులకు సంబంధించి నిధులు లేక సాగునీటి కాలువలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో సాగునీటి విడుదల పైనే సందేహాలు నెలకొంటున్నాయి. రానున్న ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా విడుదలయ్యేలా ఇప్పటి నుంచే అన్ని చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి పది ఫెయిల్ విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు సూచనలిస్తున్న డీడీ

సీతంపేట: ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులకు బుధవారం నుంచి కోచింగ్ ఇవ్వనున్నట్టు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర మంగళవారం తెలిపారు. బాలికలకు స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలోనూ, బాలురకు బాలుర ఆశ్రమ పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఆయా సెంటర్లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మొత్తం విద్యార్థులు 137 మంది హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో ఆర్‌పీ కుమార్, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, హెచ్‌ఎంలు టి.చంద్రరావు, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రబీ వరి కోతలు



వెంకటరాజపురంలో కోత మిషన్లతో రబీ వరి కోతలు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, గవరమ్మపేట తదితర గ్రామాలలో రబీ వరి కోతలు ఊపందుకున్నాయి.మంగళవారం ఒక్కరోజే మూడు కోత మిషన్లతో వరి కోతలు కోశారు. 82 కేజీల ధాన్యం రూ.1340లకు రైతులు విక్రయిస్తున్నారు. దిగుబడులు బాగా రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రబీ పంట ఎకరాకు 32 బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు వెల్లడించారు.

● పహల్గాం దాడిపై విద్యార్థుల నిరసన



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ వీరఘట్టం మండలంలోని చిట్టపులివలస గ్రామంలో విద్యార్థులు నిరసన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ఆత్మస్థైర్యం ఇవ్వాలని భగవంతుని ప్రార్థించారు. భారత్ మాతాకీ జై అంటూ చిన్నారులు నినదించారు. పాక్ ఉగ్రదాడుల దుశ్చర్యలను భారత్ తిప్పికొట్టాలని ఆకాంక్షించారు. ర్యాలీలో ఉపాధ్యాయుడు రాంబాబు, కార్యదర్శి శివకుమార్, ఏఎన్ఎం త్రివేణి తదితరులు పాల్గొన్నారు. – వీరఘట్టం

మే 7న ర్యాలీ, సభ



మాట్లాడుతున్న గిరిజన జేఏసీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మే 7వ తేదీన ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నటుట జేఏసీ నాయకులు ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, లోవరాజు, సీతారాం, తిరుపతిరావు, భూషణ్ మంగళవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, గిరిజనుల కోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఏపీ ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై సమగ్ర దర్యాప్తు జరిపి ఆ ధ్రువపత్రాలను రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం ర్యాలీ, సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో కథ, కవిత, పాట రచనపై అవగాహన కల్పించేందుకు అంతర్జాల అంతర్జాతీయ సదస్సు ఈ నెల 30 వ తేదీ మరియు మే నెల 1వ తేదీన నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రతీ రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి కవులు, ఉపన్యాసకులు పాల్గొని ఉపన్యాసిస్తారని, కావున ఆసక్తి ఉన్న విద్యార్థులు సాహితీకారులు, సాహిత్యాభిలాసులు కార్యక్రమంలో హాజరవ్వాలని కోరారు. వివరాలకు, ఆన్‌లైన్ లింక్ నిమిత్తం 9440398975 సంప్రదిచాలని కోరారు.

గ్రంథాలయంలో నీటి కథల బోధన

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు నీతి కథలు బోధించారు. నీతి కథల ద్వారా పిల్లలకు పెద్దలు అంటే గౌరవం, భక్తి భావం ఉండాలని వివరించారు. గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్ ఆధ్వర్యంలోలుంబూరు ఎంపీయూపీ స్కూల్ టీచర్ వెంకటరమణ ఆధ్వర్యంలో కథలు బోధించారు.

అక్రమ ఇసుక తవ్వకాల స్థల పరిశీలన



నదీ తీరం పరిశీలిస్తున్న గనుల శాఖ ఆర్ఐ

పాలకొండ రూరల్: నాగావళి నదీ తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గనుల శాఖ ఆర్ఐ నూర్ అహ్మద్ నదీ పరిసర ప్రాంతాలలో, నదీ తీరం వెంబడి మంగళవారం పర్యటించారు. ఈ క్రమంలో సంకిలి వంతెన కింద 500 మీటర్లలోపు, 300 మీటర్లు సమీపంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు గుర్తించారు. ఈ తరహ చర్యల వల్ల వంతెనకు ప్రమాదం ఏర్పడే ఆవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాల్లో ఇసుక తరలించినా..., ఈ తరహా చర్యలకు పాల్పడిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిర్దేశిత ప్రాంతాల దాటి వాహనాలు లోపలకు వెళ్లకుండా కందకాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సర్వేయర్ రామ్‌కుమార్, రెవెన్యూ, పోలీస్ అధికారులు, గ్రామానికి చెందిన మజ్జి వీరన్నాయుడు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట:

సీతంపేట బాలురు, బాలికల గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. వచ్చే నెల 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే వొకేషనల్ ఎల్అండ్‌టీ గ్రూపులో 20 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నామన్నారు.

బాలుర కళాశాలలో మాత్రమే వొకేషనల్ సీజీఏ గ్రూపులో 30 సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. పెద్దమడి గురుకుల బాలుర కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వచ్చే నెల 24న ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. కురుపాం మండలంలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే కురుపాం మండలం మొండెంఖల్లు నుంచి గుజ్జువాయి పంచాయతీ శ్రీరాంపురానికి చక్రవాహనంపై బి.రాజు, ఎ.సింగా వెళ్తుండగా..గొల్లగానిగూడ నుంచి మొండెంఖల్లు వెళ్లేందుకు బైక్‌పై ఎ.జీవన్, బి.విజయ్ వస్తుండగా మొండెంఖల్లు గ్రామ సమీపంలోని దొంతుకొండల మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గమనించిన సహవాహనదారులు ఫీడర్ అంబులెన్స్ సహాయంతో మొండెంఖల్లు పీహెచ్‌సీకి తరలించగా వైద్య సేవలు అందించారు. ఈ సంఘటనపై నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

భామిని: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రచార కళాజాత బృందం మంగళవారం వివరించింది. భామిని మండలం నేరడి బీ కూడలిలో కళాజాత ద్వారా ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ప్రజా సహకారంతోనే సాధ్యపడతాయని వివరించారు. సర్పంచ్ సరిసాబద్ర జగదాంబ కృష్ణమూర్తి, ఉపాధి ఎఫ్ఏ సురేందర్, వేతనదారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అప్‌గ్రేడ్‌కు పరిశీలన

- డీసీహెచ్ఎస్ డాక్టర్ నాగశివజ్యోతి



భద్రగిరి ఆసుపత్రి నమూనాను ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించినట్లు డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ కో ఆర్డినేటర్ సర్వీసెస్) డాక్టర్ నాగశివజ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆమె భద్రగిరి సీహెచ్‌సీ ఆవరణలో నిర్మాణ దశలో ఉన్న 50 పడకల ఆసుపత్రి భవనాల్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురంలో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వచ్చాయని, దానికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ ఉన్న అవకాశాలను పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో చాలీచాలనీ వసతులతో వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసరమైతే 50 కిలోమీటర్ల పైబడే ప్రయాణం చేసి వైద్య సేవలు పొందుకోవాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో 100 పడకలుగా మార్పు చేయడం ఎంతైనా అవసరమన్నారు. వైద్యులు రమ్య, రాజన్‌లతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గరుగుబిల్లి: వేసవి శిక్షణా శిబిరాలలో భాగంగా మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. మంగళవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, పుస్తక పఠనం, చదరంగం, క్యారం పోటీలు తదితరవి నిర్వహించారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జూన్ ఆరవ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూధనరావు పర్యవేక్షించారు.

చిన్నారికి అరుదైన వైద్యం

పాలకొండ: స్థానిక విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నెలలు నిండకుండా పుట్టిన బేబీకి ఆరోగ్యశ్రీ ద్వారా అరుదైన చికిత్స అందించామని ఆసుపత్రి యాజమాన్యం దూబ పద్మావతి తెలిపారు. కొత్తూరుకు చెందిన గర్భిణి త్రివేణి నెలల నిండకుండా పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. ఆసుపత్రి వైద్య నిపుణులు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో డెలివరీ చేయించామని వివరించారు. బరువు తక్కువగా, పూర్తిగా కోలుకోని శిశువు జన్మించడంతో అధునాతన వైద్యం అందించడం ద్వారా బేబీని రక్షించామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: పొల్ల కాలనీకి చెందిన కూరంగి కస్తూరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, మానాపురం సర్పంచ్ బి.లక్ష్మి, పొల్ల సర్పంచ్ గంగరాజు పాల్గొన్నారు.

భామినిలో...

భామిని: బత్తిలికి చెందిన టింగ చిన్నపిల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వారి కుటుంబ సభ్యులైన టింగ అన్నాజీరావు, టింగ శాంతికుమారిలను మంగళవారం పరామర్శించారు. చిన్నపిల్లమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోట సింహచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, మాజీ సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, మాజీ డైరక్టర్ కాగితాపల్లి కృష్ణారావు ఉన్నారు.